సాక్షి
ప్రకాశం

గురువారం । 24 । జూలై । 2025



భరోసా కరువై.. బతుకు భారమై..!

కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్లు అందక వృద్ధులు కన్నీళ్లు పెడుతున్నారు. - 8లో..



వాటర్ ప్లాంట్‌పై రాజకీయ కక్ష

పొన్నలూరు మండలం విప్పగుంటలో గ్రామస్తులకు ఉపయోగపడే వాటర్ ట్యాంక్‌ను అధికారులు రాజకీయ కక్షతో సీజ్ చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31 /27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

● డీఈఓకు టీచర్స్ గిల్డ్ వినతి

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్ రెడ్డి బుధవారం డీఈఓ కిరణ్‌కుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 16 ఎయిడెడ్ పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌తో పనిచేస్తున్న 48 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఒక పాఠశాలలో పనిచేసేలా ఆర్డర్ ఇవ్వాలన్నారు. జిల్లాలో మిగులుగా ఉన్న 120 మంది ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులు రోజుకో పాఠశాల చొప్పున వివిధ పాఠశాలలకు పంపుతున్నారని, వారికి శాశ్వతంగా సంవత్సరం మొత్తం ఒక పాఠశాలను కేటాయించి పేస్ అటెండెన్స్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ విద్యార్థులకు ఇచ్చే అన్ని రకాల వసతులు ఎయిడెడ్ విద్యార్థులకు కల్పించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల జీతాల సమస్యను పూర్తిగా జీవో నంబర్ 155 ప్రకారం మండల విద్యాశాఖ అధికారులకు పూర్తి బాధ్యత ఇవ్వాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలలకు అన్ని రకాల సమగ్ర శిక్ష అభియాన్ నిధులు విడుదల చేయాలన్నారు. పై సమస్యలను డీఈఓ కోఆర్డినేషన్ మీటింగ్ ద్వారా పరిష్కరించాలని కోరారు.

క్షయ బాధితులకు ఆర్థిక సాయం



ప్రశంస పత్రాలు అందిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: క్షయ బాధితులకు మంచి పోషకాహారం కోసం గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు అందజేశారు. జిల్లాలోని 12 మంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు రూ.2,60,000 లను విరాళంగా ఇచ్చారు. కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీవాణికి అందించారు. విరాళం ఇచ్చిన వారికి ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశంస పత్రాలు ఇచ్చారు.

వీరయ్య హత్య కేసులో ముప్పా అనిత విచారణ

ఒంగోలు సిటీ: టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితుడైన ముప్పా సురేష్ భార్య అనిత విచారణకు హాజరయ్యారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విచారణాధికారి డీఎస్పీ రాయపాటి శ్రీనివాస్ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆమెను విచారించారు. వీరయ్య చౌదరిని హత్య చేసేందుకు హైదరాబాద్ లోని ముప్పా నివాసంలో ముప్పా సురేష్, వినోద్‌లు మాట్లాడుకునే సమయంలో ఆమె అక్కడే ఉన్నారని పోలీసుల విచారణలో నిందితులు చెప్పినట్లు పోలీసులు ప్రకటించడం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమెను విచారణకు హాజరు కావాలని ఈ నెల 5వ తేదీన 35(3) బీఎన్ఎస్ఎస్ నోటీసులు ఇచ్చారు. ముందస్తు బెయిల్ కోసం ముప్పా సురేష్ హైకోర్టులో దరఖాస్తు చేసుకోవడంతో పోలీసుల విచారణకు హాజరయ్యేందుకు సమయం అడిగారు. ముందస్తు బెయిల్ ను కోర్టు తిరస్కరించడంతో ఆమె పోలీసు విచారణకు హాజరయ్యారు.

పెండింగులో దరఖాస్తులు.. ఇబ్బందుల్లో వైద్యులు

● కలెక్టర్ జోక్యానికి వినతి

మార్కాపురం: జిల్లా వ్యాప్తంగా నూతన స్కానింగ్ సెంటర్లకు అనుమతి, పాత స్కానింగ్ సెంటర్లకు రెన్యువల్స్ రాక 4 నెలల నుంచి వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ వ్యాధుల నిర్ధారణకు స్కానింగ్‌లు అవసరం. జిల్లాలో పలుచోట్ల నూతన వైద్యశాలలు ఏర్పాటయ్యాయి. వీటిలో స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలంటే జిల్లా ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వాలి. జిల్లాలో మార్కాపురం, టంగుటూరు, దర్శిల్లో నూతన హాస్పిటల్స్‌కు కొత్తగా అనుమతుల మంజూరు, త్రిపురాంతకం, పొదిలి తదితర ప్రాంతాల్లో పాతవాటికి రెన్యువల్స్ చేయాలి. అయితే నాలుగు నెలల నుంచి అనుమతులు రాకపోవడంతో ఆయా వైద్యశాలల డాక్టర్ల వద్దకు వచ్చే రోగులకు స్కానింగ్ సౌకర్యం లేకపోవడంతో అటు డాక్టర్లు, ఇటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా నూతన స్కానింగ్ సెంటర్లకు అనుమతులు ఇవ్వాలని పలువురు డాక్టర్లు కోరుతున్నారు.

అంతా ఆర్భాటం.. రుణాల ఊసేలేదు..!

వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలిచ్చి యువతను ఆర్థికంగా బలోపేతం చేస్తామంటూ కూటమి ప్రభుత్వ హామీ ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరు ప్రక్రియ ప్రహసనంగా మారింది. ఎస్సీ కార్పొరేషన్ రుణాల ప్రక్రియ దరఖాస్తుల దశలోనే నిలిచిపోగా.. బీసీల రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా సబ్సిడీ నగదు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తోంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండు ఆర్థిక సంవత్సరాలు పూర్తవుతున్నా కార్పొరేషన్ రుణాలు ఎండమావిగానే మిగిలాయని నిరుద్యోగ యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



- కార్పొరేషన్ రుణాల కోసం యువత ఎదురుచూపులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మొండిచేయి
- బీసీ రుణాలు గ్రౌండింగ్‌కే పరిమితం.. సబ్సిడీ నిధులివ్వని ప్రభుత్వం
- దరఖాస్తు దశలోనే నిలిచిపోయిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలు
- లబ్ధిదారుల ఎదురుచూపులు
- వయోపరిమితిలో ఎస్సీ, ఎస్టీలపై వివక్ష

బేస్తవారిపేట/ఒంగోలు వన్‌టౌన్:

రాష్ట్రంలో స్వయం ఉపాధి పథకాల అమలులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. కార్పొరేషన్ రుణాల మంజూరు అంటూ ఊరిస్తూ ప్రకటనలకే పరిమితమవుతోంది. ప్రభుత్వ సహకారంతో బ్యాంకుల చేదోడుతో జీవితంలో స్థిరపడదామనుకుంటున్న యువత కల సాకారం కావడం లేదు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధికి రుణాలు ఇస్తామని హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఒక్కరికి కూడా రుణం ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. గత ఏప్రిల్ నెలలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కార్పొరేషన్ రుణాలు ఇస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది.

ఎస్సీ స్వయం ఉపాధి రుణాలు ఇలా..

ఫ్లవర్ బొకే మేకింగ్ అండ్ డెకరేషన్, వర్మీకంపోస్టు అండ్ ఆర్గానిక్ మాన్యూర్, ప్లంబింగ్ అండ్ ఎలక్ట్రీషియన్ సర్వీసెస్, వాటర్ రీసైక్లింగ్, మొబైల్ రిపేరింగ్, సోప్ అండ్ డిటర్జంట్ మేకింగ్, వెల్డింగ్ అండ్ ఫాబ్రికేషన్ యూనిట్, సోలార్ ఎనర్జీ సేల్స్, ప్రమోషన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, జనరిక్ మందుల దుకాణాలు, బ్యాటరీ ఆటోలు, బేకరీలు తదితర సెక్టార్ల ద్వారా రుణాలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సెక్టార్ టైప్-1 రూ.3 లక్షల వరకూ 60 శాతం సబ్సిడీతో 3770 యూనిట్లు, సెక్టార్ టైప్-2 రూ.3 లక్షలకు పైగా రుణం 40 శాతం సబ్సిడీతో 10,490 యూనిట్లను గ్రౌండింగ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఐఎస్‌బీ సెక్టార్ టైప్-3 రూ.10 లక్షల కంటే ఎక్కువ రుణాలు 40 శాతం సబ్సిడీతో 10 (ఈవీ బ్యాటరీ చార్జింగ్) యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి. ట్రాన్స్‌పోర్టు సెక్టార్ ఈ-ఆటోలు రూ.3 లక్షల వరకూ 50 శాతం సబ్సిడీతో 780 యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి. అయితే ఇవి దరఖాస్తు దశలోనే నిలిచిపోవడం గమనార్హం.

బీసీ రుణాలు ఇలా..

బీసీ స్వయం ఉపాధి రుణాల కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. బీసీలతో పాటూ, ఈబీసీ, రెడ్డి, ఆర్య, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందిస్తామని చెప్పింది. బీసీలకు ఫిష్ ఫార్మింగ్, వాటర్ బాటిల్స్ రీసైక్లింగ్, ఫ్లైయాష్ బ్రిక్, ప్లంబింగ్, ఎల్ఈడీ బల్బుల అసెంబ్లింగ్ యూనిట్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, మూడు చక్రాల ఆటో, గూడ్స్ సరఫరా చేసే ట్రక్, నాలుగు చక్రాల ఆటో మొబైల్ కార్ వాష్, బేకరీలు, మెడికల్ ల్యాబ్స్, బ్యూటీ పార్లర్, వంటి వాటిని ఏర్పాటు చేసుకునేలా యూనిట్లను నిర్ణయించింది. స్లాబ్-1లో రూ.2 లక్షల వరకూ, స్లాబ్-2లో రూ.2- రూ.3 లక్షల వరకూ, స్లాబ్-3లో రూ.3-రూ.5 లక్షల వరకూ 50 శాతం సబ్సిడీతో మిగిలిన నగదును బ్యాంక్ రుణం ద్వారా అందిస్తామని పేర్కొంది.

జిల్లాలో వివిధ రకాల రుణాల వివరాలు

రుణాలు రకం	టార్గెట్	దరఖాస్తు చేసుకున్నవారు	గుర్తించిన అర్హులు
బీసీ	1407	12,604	11,510
కాపు	197	3,553	3,228
బ్రాహ్మిణ్	14	74	65
ఈబీసీ	41	262	225
క్షత్రియ	4	20	20
రెడ్డి	227	834	757
ఆర్యవైశ్య	49	422	377
కమ్మ	216	781	728

బీసీ రుణాలు మంజూరైనా అందని సబ్సిడీ నగదు

జిల్లాలో బీసీ కార్పొరేషన్ రుణాలు టార్గెట్ 1407 ఉంటే 12,604, కాపు కార్పొరేషన్‌లో టార్గెట్ 197కు 3,553 దరఖాస్తులు అందాయి. బీసీ స్వయం ఉపాధి రుణాల ఎంపికల కోసం వేలాది మంది పేదలు, నిరుద్యోగులు, ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కట్టారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఎంపీడీఓలు బ్యాంకులకు జాబితాలు పంపించారు. టార్గెట్ ఇచ్చిన బ్యాంకుల నుంచి అప్రూవల్ చేసి ఎంపీడీఓ లాగిన్‌కు బ్యాంకు అధికారులు పంపారు. ఇక్కడి నుంచి బీసీ కార్పొరేషన్ లాగిన్‌కు పంపడం అనుమతులు ఇవ్వడం జరిగిపోయింది. ప్రభుత్వం సబ్సిడీ నిధులు విడుదల చేయకపోవడంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమకాలేదు. యూనిట్లు పెట్టుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్న లబ్ధిదారులు నగదు అందక నానా అవస్థలు పడుతున్నారు.



మళ్లీ నోటిఫికేషన్ ఇస్తారు

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల దరఖాస్తులు ఆన్‌లైన్ దశలోనే నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. మళ్లీ నోటిఫికేషన్ ఇస్తారు.
– అర్జున్‌నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఒంగోలు

వయోపరిమితిలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

ఎస్సీ, ఎస్టీలకు కార్పొరేషన్ రుణాలు పొందడానికి 50 ఏళ్ల వయో పరిమితిని విధించింది. అదే బీసీలకు 60 సంవత్సరాలుగా నిర్ణయించింది. ఈ నిబంధనతోనే కూటమి ప్రభుత్వానికి ఎస్సీలపై ఉన్న కపట ప్రేమ కళ్లకు కట్టినట్టు అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 50 సంవత్సరాలకే వృద్ధాప్య పెన్షన్‌లు ఇస్తామని వాగ్దానం చేసి ఎస్సీలను మోసం చేశారు.
– నీలం నాగేంద్రరావు, దళిత సంఘ నాయకుడు, ఒంగోలు

దరఖాస్తు దశలోనే నిలిచిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రుణాలు:

ఎస్సీ కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలోనే వెబ్‌సైట్‌ను నిలిపేశారు. అప్పటికే అరకొరగా దరఖాస్తు చేసుకున్నారు. తర్వాత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ ఇస్తామని అధికారులు తెలిపారు. మూడు నెలలవుతున్నా కనీసం దరఖాస్తులకు కూడా అవకాశం కల్పించలేదు.

వయో పరిమితి పేరుతో సవతి ప్రేమ..

కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసేందుకు బీసీల వయో పరిమితిని 60 సంవత్సరాలుగా నిర్ణయించిన ప్రభుత్వం, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వయోపరిమితిని 50 ఏళ్లుగా నిర్ణయించి తమపై సవతి ప్రేమను చూపిస్తోందని ఆయా వర్గాల వారు మండిపడుతున్నారు. దీనికి తోడు బ్యాంకులకు గతంలో రుణ చెల్లింపులు సరిగ్గా లేకపోయినా, కట్టకపోయినా అటువంటి వారికి ప్రస్తుతం రుణాలు ఇవ్వరు. ఇదే పనిగా బ్యాంకుల సిబిల్ స్కోర్‌ను చూస్తున్నారు.

రికార్డు పతాక



మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్.దామోదర్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

- ఒంగోలులో 3,600 అడుగుల త్రివర్ణ పతాకంతో దేశభక్తి ర్యాలీ
- వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పతాక ప్రదర్శన

ఒంగోలు సిటీ: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ రికార్డు సాధనే లక్ష్యంగా ఒంగోలులో 3,600 అడుగుల పొడవైన జాతీయ జెండాతో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ ఎ.రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శిద్దా వెంకట సూర్యప్రకాష్‌రావు, ఇతర సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాక ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో పాటు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ గ్రౌండ్ నుంచి అద్దంకి బస్టాండ్ వరకు భారీ జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్.దామోదర్ మాట్లాడుతూ జాతీయ జెండాను తెలుగు వారైన పింగళి వెంకయ్య రూపొందించడం గర్వకారణమన్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన మహోన్నత వ్యక్తికి ఇలాంటి గొప్ప ఘనత దక్కిందని, త్రివర్ణ పతాకాన్ని చూస్తేనే.. మనలో సహజంగానే దేశభక్తి, గర్వం ఉరకలేస్తాయన్నారు. శాంతి, సహనం, అహింస అనే తత్వాన్ని మన జాతీయ జెండా చాటి చెబుతుందన్నారు. జాతీయ భావనను, సమైక్యతను పెంపొందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషదాయకమని తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, తాలూకా సీఐ విజయకృష్ణ, వన్‌టౌన్ సీఐ నాగరాజు, టూటౌన్ సీఐ యం.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



3600 అడుగుల పొడవున్న జాతీయ జెండాతో నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

ఒంగోలు సిటీ:

స్థానిక జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం బుధవారం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి పాల్గొన్న ఈ సమావేశాల్లో కనిగిరి ఎమ్మెల్యేతో పాటు, జెడ్పీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మూడు జిల్లాల అధికారులు హాజరయ్యారు. 2వ స్థాయీ సంఘమైన గ్రామీణాభివృద్ధిలో భాగంగా డీఆర్‌డీఏ-హౌసింగ్ శాఖలకు సంబంధించి గత సమావేశాల్లో సభ్యులు అడిగిన అంశాలపై తీసుకున్న చర్యలు, అలాగే ప్రస్తుతం పురోగతిలో ఉన్న పథకాలపై సమీక్షించారు. వివిధ స్థాయీ సంఘాలైన వ్యవసాయ సంబంధిత అంశాలు, విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమ కమిటీ, సాంఘిక సంక్షేమ కమిటీలపై సమీక్షించారు. ప్రతిపాదించిన పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు.



స్థాయీ సంఘాల సమావేశం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

సూర్య ఘర్‌పై అవగాహన కల్పించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్:

పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం అమలు పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం కింద ఇప్పటి వరకు 83,013 దరఖాస్తులు రాగా, అందులో 1890 దరఖాస్తులు గ్రౌండింగ్ చేశామని, 1754 సోలార్ ఇన్సులేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. రోజువారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని జిల్లాలో పీఎం సూర్యఘర్ అమలును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గానికి 10 వేల లక్ష్యాన్ని నిర్దేశించారని, అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో తూర్పు నాయుడుపాలెం, శంఖవరం, నాగంబట్లపాలెం, సింగరాయకొండ, బేస్తవారిపేట గ్రామాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించి అందుకోసం చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతిపై ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్షించారు. ఎక్కడైనా సబ్సిడీ రిలీజ్ చేయడంలో సమస్యలు ఉంటే వెంటనే ఎల్‌డీఎం దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. సూర్య ఘర్‌కు సంబంధించి వివరాలను ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఎల్‌డీఎం రమేష్, సోలార్ విద్యుత్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.



పీఎం సూర్య ఘర్‌పై కలెక్టర్‌కు వివరిస్తున్న ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ

నిలిచిన పొగాకు వేలం

● అధిక సంఖ్యలో బేళ్లను తిరస్కరిస్తుండటంతో వేలాన్ని నిలిపేసిన రైతులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం ఎక్కువగా నోబిడ్లు పడడంతో వేలాన్ని రైతులు నిలిపేశారు. కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1233 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. ఉదయం ఎనిమిది గంటలకు వేలం నిర్వహణ అధికారి వేలాన్ని ప్రారంభించారు. వేలం ప్రారంభించినప్పటి నుంచి అధిక సంఖ్యలో బేళ్లను తిరస్కరిస్తుండటంతో రైతులు వేలాన్ని అడ్డుకున్నారు. ధర తగ్గించైనా అన్ని బేళ్లను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అసలే పొగాకు రైతుకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతుంటే బేళ్ల తిరస్కరణతో రైతుల మీద అధిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు అసలు పొగాకు బేళ్లను ఎందుకు తిరస్కరిస్తున్నారో కూడా అర్థం కావడం లేదన్నారు. అనంతరం వేలం నిర్వహణ అధికారి జీ సునీల్ కుమార్ రైతులతో చర్చించి వ్యాపారులతో మాట్లాడి అన్ని బేళ్లను కొనుగోలు చేయించేలా ఒప్పిస్తానని హామీ ఇచ్చి వేలాన్ని కొనసాగించారు. భోజన విరామం తర్వాత ప్రారంభమైన వేలంలో కూడా మళ్లీ అధిక సంఖ్యలో వ్యాపారులు బేళ్లను తిరస్కరించారు. 833 బేళ్లకు వేలం నిర్వహించగా 517 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 316 బేళ్లను తిరస్కరించారు. 400 బేళ్లు వేలానికి ఇంకా ఉండగానే ఎక్కువ బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ రైతులు మళ్లీ వేలాన్ని బహిష్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.281, కనిష్ట ధర కేజీ రూ.160, సరాసరి ధర కేజీ రూ.206.65 గా నమోదైంది. వేలంలో 23 కంపెనీలు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. వెంటనే ప్రభుత్వాలు వ్యాపారులతో మాట్లాడి అన్ని బేళ్లను కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించేలా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు



కొండపిలో రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణ అధికారి జీ సునీల్ కుమార్

50 శాతం పొగాకు బేళ్లు తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 402 పొగాకు బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. తెచ్చిన బేళ్లలో 50 శాతం తిరస్కరించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలం ప్రక్రియకు అన్ని కంపెనీలు పాల్గొనకపోయినా బోర్డు ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వేలం కేంద్రానికి చింతలపాలెం, దావగూడూరు గ్రామాలకి చెందిన రైతులు 896 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 494 బేళ్లు కొనుగోలు చేశారు. 402 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280 కాగా, కనిష్ట ధర రూ.160, సరాసరి రూ.192.06 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 9 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

పీ- 4 పథకంలో మార్గదర్శకులదే ప్రధాన పాత్ర

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



ప్రైవేటు యాజమాన్యాలతో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: పేదరికం లేని సమాజ ఆవిష్కరణ కోసం పీ – 4 పథకంలో మార్గదర్శకులుగా నిలిచి మీ వంతు సహకారం అందించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ప్రకాశం భవనంలోని మీ కోసం సమావేశ మందిరంలో బుధవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, పరిశ్రమలు, గ్రానైట్ సంఘాల ప్రతినిధులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ఎరువులు, రసాయనాలు, డెయిరీ ఫారాల యజమానులతో ఆమె వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. పీ – 4 పథకం గురించి జెడ్పీ సీఈఓ చిరంజీవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో 74 వేల కుటుంబాలను గుర్తించామని, ఆ కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచి పేదరికాన్ని అధిగమించేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పథకంలో స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా ముందుకు రావాలని, శక్తి మేరకు ఎన్ని కుటుంబాలనైనా దత్తత తీసుకునే వెసులుబాటు ఉందని కలెక్టర్ తెలిపారు. మీ ప్రాంతంలోని ఈ చిన్నారుల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా చూసేందుకు పాఠశాలల యాజమాన్యాలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సహాయం చేసేందుకు కూడా ప్రైవేట్ ఆస్పత్రులు ముందుకు రావచ్చన్నారు. బంగారు కుటుంబాల్లో అర్హులకు ఆస్పత్రిలో ఉద్యోగావకాశాలల్లో ప్రాధాన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఈఓ కిరణ్‌కుమార్, సీపీఓ స్వరూపరాణి, గనుల శాఖ డీడీ రాజశేఖర్, జిల్లా పరిశ్రమల సంస్థ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ శ్రీనివాస నాయక్, ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త హేమంత్, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్-మనక్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

● డీఈఓ కిరణ్‌కుమార్

ఒంగోలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు ఇన్‌స్పైర్–మనక్ అవార్డులకు తప్పనిసరిగా దరఖాస్తు చేయాలని డీఈఓ కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు మక్కువ పెంచేలా, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా విద్యార్థులకు ప్రాజెక్టుల రూపకల్పనలో మార్గనిర్దేశం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఇన్‌స్పైర్ మనక్ వెబ్ పోర్టల్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలు 3 నామినేషన్లు, హైస్కూళ్లు 5 నామినేషన్లు, హైస్కూల్ ప్లస్ పాఠశాలలు 7 ఆలోచనలను నామినేట్ చేయవచ్చని స్పష్టం చేశారు. ఆగస్టు 15వ తేదీలోగా విద్యార్థుల ప్రాజెక్ట్ వివరాలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి అత్యధిక నామినేషన్లు పంపేందుకు సహకరించాలని కోరారు. వివరాలకు డీఎస్ఓ రమేష్ 96669 55504ను సంప్రదించాలని సూచించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులను కూడా ప్రతి తరగతి నుంచి ఒకరిని చేర్చాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రాణం కాపాడిన వెంటిలేటర్!



జీజీహెచ్ ఐసీయూలో రోగికి చికిత్స చేస్తున్న వైద్యులు

మార్కాపురం: పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తిని మార్కాపురం జీజీహెచ్‌లో వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి ప్రాణం కాపాడారు. అత్యవసర సందర్భాల్లో రోగులను వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందించడం సాధారణ విషయమే కానీ మార్కాపురం జీజీహెచ్‌లో మాత్రం ప్రత్యేకం. ఇక్కడ వెంటిలేటర్ సౌకర్యం లేనప్పుడు అత్యవసర వైద్య చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు రోగులను తరలించేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జీజీహెచ్‌లో 11 వెంటిలేటర్లు ఏర్పాటు చేయడంతో ఎంతో మంది రోగుల ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడ్డాయి. ఐసీయూ సేవలు కొన్ని నెలలుగా నిలిచిపోవడం, వెంటిలేటర్లు నిరుపయోగంగా వదిలేసిన విషయంపై 'సాక్షి'లో ఇటీవల కథనం ప్రచురించడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. వారం క్రితం ఐసీయూ వార్డును మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల కలిసి పునఃప్రారంభించారు. ఆ వెంటిలేటర్ సేవలే ఇప్పుడు ఓ వ్యక్తి ప్రాణం కాపాడాయి. తర్లుపాడుకు చెందిన వి.గాలెయ్య పురుగుమందు తాగడంతో కుటుంబ సభ్యులు మార్కాపురం జీజీహెచ్‌కు తీసుకురాగా వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు ప్రాణం కాపాడినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు తెలిపారు. డాక్టర్ మధుకిరణ్, డాక్టర్ ఉష అత్యవసర చికిత్స చేసి ప్రాణాపాయం నుంచి గాలెయ్యను రక్షించారని వివరించారు.

భరోసా కరువై

బతుకు భారమై..!

● ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల కోసం ఎదురుచూపులు
● జిల్లాలో స్పౌజ్ కోటాలో సుమారు 5 వేల మందికి పింఛన్లు మంజూరు
● మూడు నెలలుగా నిధులు ఇవ్వని ప్రభుత్వం ● పింఛన్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

కనిగిరిరూరల్:

భారమవుతున్న బతుకులకు ఆసరా కరువైంది.. ఆదుకోవాల్సిన ప్రభుత్వం అండగా నిలవడం లేదు. కూటమి ప్రభుత్వంలో కొత్తగా పింఛన్లు అందక వృద్ధులు కన్నీళ్లు పెడుతున్నారు. వితంతువులు, దివ్యాంగులు, కన్నవారి ఆదరణ నోచుకోని వృద్ధులు, కార్మికులకు వేలాది మందికి ప్రభుత్వ భరోసా లేక పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

ఒక్క పింఛన్ ఇస్తే ఒట్టు..

కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ఈ ఏడాది కాలంలో కొత్త పెన్షన్ల మాట దేవుడేరుగు. కనీసం స్పౌజ్ కోటా పెన్షన్లు సైతం ఇవ్వకుండా లబ్ధిదారులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోంది. ఫలితంగా ఆ లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు ఏం చేయలేని నిస్సహాయత. కూటమి పాలనలో కొత్త పింఛన్లకు ఇప్పటి వరకు ఎటువంటి దరఖాస్తులు స్వీకరించలేదు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య చనిపోయిన వారికే (సామాజిక పింఛన్‌దారులు మరణిస్తే..) వారి భార్యలకు స్పౌజ్ కేటగిరిలో పింఛన్ మంజూరుకు అర్హులుగా నిర్ధారించారు. దీంతో పింఛన్ పొందని వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబంలో అర్హులు ఉన్నా వారికి పింఛన్ మంజూరు చేయడం లేదు. దీంతో జిల్లాలో వందలాది మంది వితంతువులు పింఛన్ పొందేందుకు అర్హత ఉన్నా..వారికి మొండిచేయి ఎదురవుతోంది.



పింఛన్ దారులు (ఫైల్)

మంజూరు చేసినా..నిధులివ్వకుండా మెలిక

జిల్లాలో సుమారు 5 వేల మందికి స్పౌజ్ కోటాలో పింఛన్లు మంజూరయ్యాయి. అయితే ప్రభుత్వం మాత్రం పైసా నిధులు ఇవ్వకుండా కాలయాపన చేస్తోంది. దీంతో కొంత మంది అర్హులు పింఛన్ కోసం ఎదురుచూస్తూ ఇప్పటికే కాలం చెల్లారు. ప్రస్తుతం స్పౌజ్ అర్హుల్లో 25 శాతం మంది మరణించగా.. మరో 5 శాతం మంది వివిధ కారణాలతో అనర్హులుగా తేలినట్లు అధికారులు నివేదికలు పంపినట్లు సమాచారం. అందిన సమాచారం ప్రకారం జిల్లాలోని రూరల్, అర్బన్ మున్సిపాలిటీల్లో సుమారు 5 వేల మంది స్పౌజ్ కోటాలో అర్హత కల్గిన వారుగా తేలగా అందులో కేవలం 3,500 మంది మాత్రమే అర్హత కోటాలో ఇప్పటి వరకు లైవ్‌లో ఉన్నట్లు సమాచారం. సుమారు 1,000 మంది వరకు వివిధ కారణాలతో జాబితాల్లో అర్హత కోల్పోనున్నారు.

– కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 587 మంది స్పౌజ్ కోటాలో అర్హులు. కనిగిరి మున్సిపాలిటీలో 68 మంది, కనిగిరి రూరల్‌లో 105 మంది, హెచ్ఎంపాడులో 59 మంది, పీసీ పల్లిలో 74 మంది, సీఎస్‌పురంలో 85 మంది, వెలిగండ్లలో 71 మంది, పామూరులో 110 మంది స్పౌజ్ కోటాలో అర్హతగా వితంతువులు ఉన్నా.. వారిలో 100 మంది వరకు (కాలం చెల్లినవారు, ఇతర కారణాలతో అనర్హత వేటు పడిన వారు) వివిధ కారణాలతో అర్హత జాబితాల్లోకి ఎక్కలేదని తెలిసింది.



50 ఏళ్లకే పింఛన్ ఏమైందో..

కూటమి సర్కార్ కొలువు తీరిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఈ హామీపై నేటికి అతీగతి లేదు. జిల్లా వ్యాప్తంగా అనేక మంది పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రమాణికంగా కొత్త పింఛన్లు మంజూరు చేశారు. మధ్యవర్తులు, దళారులతో పనిలేకుండా అర్హతే ప్రమాణికంగా రాజకీయాలకు, పార్టీలకు, వర్గాలకు, కులాల కతీతంగా కేవలం అర్హతను బట్టి ప్రతి ఏడాది జనవరి, జూలై నెలల్లో పింఛన్లు అందచేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అర్హతను బట్టి అధికారులు పింఛన్లు మంజూరు చేసేవారు. నేడు ఆ పరిస్థితి లేదు.

సైట్ ఓపెన్ అయితే దరఖాస్తులు స్వీకరిస్తాం



స్పౌజ్ కోటాలో ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది. కానీ ఇంకా నిధులు విడుదల కాలేదు. కనిగిరి మండలానికి 105 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయి. గ్రాంట్ వచ్చిన తర్వాత ఎన్ని నెలలకు ఇస్తారనే తెలుస్తోంది. కొత్త పింఛన్లకు సైట్ ఓపెన్ అయితే దరకాస్తులు స్వీకరిస్తాం.

ప్రభాకర్‌శర్మ, ఎంపీడీఓ, కనిగిరి

వాటర్ ప్లాంట్‌పై రాజకీయ కక్ష



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



మంత్రి స్వామి ఆదేశాలతో వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

● మంత్రి స్వామి చెప్పాడంటూ వాటర్ ప్లాంట్ సీజ్ చేసిన తహసీల్దార్
● రాజకీయ కక్షసాధింపుతో విప్పగుంటలో ఉద్రిక్త పరిస్థితులు
● నెల క్రితం మూసివేసిన వాటర్ ప్లాంట్‌ని కావాలనే సీజ్ చేయించిన మంత్రి స్వామి
● మంచినీటికి అవస్థలు పడుతున్నామని శాపనార్థాలు పెట్టిన మహిళలు

పొన్నలూరు: గ్రామాల్లో కూటమి నేతల ఆగడాలు హద్దుమీరిపోతున్నాయి. ప్రతి విషయంలో అనవసరంగా జోక్యం చేసుకుంటూ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడూ అధికారులను అడ్డుపెట్టుకొని అరాచకాలు సృష్టిస్తున్నారు. పొన్నలూరు మండలం విప్పగుంటలో కొంకా శ్రీనివాసులు సర్వే నంబర్ 336లో తన పూర్వీకులు నుంచి సంక్రమించిన సుమారు 2 సెంట్ల స్థలంలో ఒంగోలు వాటర్ బోర్డు వారి నుంచి అనుమతి తీసుకొని వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని ద్వారాగా గ్రామంలోని పేద కుటుంబాలకు ఉచితంగా మంచినీటిని అందిస్తూ, గ్రామస్తులకు రూ.3 చొప్పున 20 లీటర్లు మంచినీటిని అందిస్తున్నాడు. అయితే ఇది జీర్ణించుకోలేని స్థానిక టీడీపీ నాయకులు ఎలాగైనా వాటర్ ప్లాంట్‌ను మూసివేయించాలని రాజకీయ కక్ష సాధింపులతో మంత్రి బాలవీరాంజనేయస్వామి ద్వారాగా స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిని పురమాయించారు. మంత్రి స్వామి చెప్పిందే తడువుగా ఏప్రిల్‌లో అధికారులు విప్పగుంట గ్రామానికి వెళ్లి వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి లేదంటూ, ఇలానే ప్లాంట్ కొనసాగిస్తే కేసులు బనాయించాల్సి ఉంటుందని బెదిరించి మూసివేయించారు.

ఆగని కక్ష సాధింపులు...

వాటర్ మూసివేయించి విద్యుత్ సరఫరాను నిలిపివేయించిన నేతల కక్ష సాధింపు చర్యలు అంతటితో ఆగలేదు. వాటర్ ప్లాంట్‌ను పూర్తిగా సీజ్ చేయించాలని పథకం రచించి వాల్టా చట్టం ద్వారా వాటర్ ప్లాంట్‌కు సంబంధించిన బోర్‌కు అనుమతి లేదని కారణం చూపారు. రెండు రోజుల వరకు లేని వాల్టా చట్టం కమిటీని హడావుడిగా ఏర్పాటు చేయించిన మంత్రి స్వామి మరోసారి తహసీల్దార్, ఎంపీడీఓకి ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్, ఎంపీడీఓ పోలీసుల సహకారంతో బుధవారం గ్రామంలోకి ప్రవేశించడంతో విప్పగుంటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

మహిళల శాపనార్థాలు

మంత్రి స్వామి ఆదేశాలతో వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయడానికి అధికారులు వస్తున్నారని తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని అధికారులను ప్రశ్నించారు. మంచినీటి విషయంలో చిల్లర రాజకీయాలు చేయడం మంత్రి స్వామి, అధికారులు మానుకోవాలని శాపనార్థాలు పెట్టారు. న్యాయంగా వ్యవహరించాల్సిన అధికారులు కూటమి నేతల మాటలు విని ఇలాంటి పనులకు పాల్పడి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ఏంటంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని ప్రశ్నించడంతో గ్రామస్తులకు సమాధానం చెప్పలేని తహసీల్దార్, ఎంపీడీఓ ఏం చేప్పాలో తెలియక మిన్నుకుండిపోయారు. వాల్టా చట్టం కింద అనుమతి లేకపోవడంతో బోర్‌ను మాత్రమే సీజ్ చేశామని నోటీసులో పేర్కొన్నారు. బోరును కాకుండా రూంను సీజ్ చేశారు. అయితే ఇదే గ్రామంలో పంచాయతీ కార్యాలయం నుంచి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ స్థానిక టీడీపీ నాయకులు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ జోలికి అధికారులు వెళ్లకపోవడం కోసమెరుపు.

నాటుసారాపై పటిష్ట నిఘా

● ఎక్సైజ్ డీసీ హేమంత్ నాగరాజు

మార్కాపురం: నాటుసారా తయారీదారులపై నిఘా పెట్టి దాడులు చేసి కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు ఆదేశించారు. మార్కాపురం ఎక్సైజ్ డిపోను, ఏఈఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా తయారీ గ్రామాలపై నిఘా పెట్టి పూర్తిగా సారాను నిరోధించాలన్నారు. పాత నేరస్తులపై దృష్టి సారించాలన్నారు. మద్యం దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులను పరిశీలించి చార్జీషీట్లు నమోదుచేయాలని చెప్పారు. గోడౌన్‌లో స్టాక్ రికార్డులు, డిపో నిర్వహణ పరిశీలించి బాటిల్ క్యాప్‌ల తొలగింపును పరిశీలించారు. ఈయన వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం, గోడౌన్ డీఎం రాధాకృష్ణ, సీఐ వెంకట రెడ్డి, ఎస్సై గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.



స్టాక్‌ను పరిశీలిస్తున్న డీసీ నాగరాజు, పక్కన అధికారులు

పారిశుధ్యం మెరుగవ్వాలి

● డోర్ టూ డోర్ చెత్త సేకరించేందుకు చర్యలు చేపట్టండి
● దోమల నివారణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలి
● ఒంగోలు కార్పొరేషన్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ఒంగోలులో పారిశుధ్య కార్మికుల సమ్మెతో పరిస్థితి దారుణంగా మారిన నేపథ్యంలో కలెక్టర్ బుధవారం నగరంలోని కోట వీధి, బలరాం కాలనీ, మిలటరీ కాలనీ, దిబ్బల రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. తొలుత కోట వీధిలో పర్యటించిన కలెక్టర్.. డ్రైనేజ్ క్లీనింగ్ ప్రక్రియ పటిష్టంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణకు శానిటేషన్ సిబ్బంది వారంలో ఎన్ని రోజులు వస్తున్నారో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పాత మార్కెట్ సెంటర్‌లో పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన శానిటేషన్ సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బలరాం కాలనీ, మిలటరీ కాలనీలో పర్యటించిన కలెక్టర్‌కు స్థానికులు డ్రెయినేజీ శుభ్రం చేయడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దోమల నివారణకు డివిజన్ల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. వర్షా కాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శానిటేషన్ అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి తదితరులు ఉన్నారు.



పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గ్రంథాలయాల అభివృద్ధికి దోహదపడాలి

ఒంగోలు సబర్బన్: నగర పాలకసంస్థ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు జిల్లా గ్రంథాలయ సంస్థకు బకాయలు చెల్లించాలని మునిసిపల్ కమిషనర్లను, జిల్లా పంచాయతీ అధికారిని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో లైబ్రరీ సెస్ బకాయిలపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం, సెస్ కమిటీ మీటింగ్‌ను సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఒంగోలు నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో రూ.73 లక్షలతో ఆధునీకరణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తొలి విడతగా రూ.23 లక్షలు మంజురు చేసినట్లు తెలిపారు. గ్రంథాలయాల్లో పుస్తకాలు, మెటీరియల్‌పై ఆరా తీశారు. గ్రంథాలయాల అభివృద్ధికి సంబంధించి 2025–26 బడ్జెట్‌ను, కందుకూరు, వలేటివారిపాలెం, ముండ్లమూరు, కొమరోలు శాఖా గ్రంథాలయాల భవనాలకు 5 శాతం అద్దె పెంపును సర్వసభ్య సమావేశంలో కమిటీ ఆమోదించింది. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శివారెడ్డి, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీపీఓ వెంకట నాయుడు, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, ఆడిట్ అధికారి రమేష్, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



గ్రంథాలయ సంస్థ అధికారులతో సమీక్షిస్తున్న జేసీ గోపాలకృష్ణ